RNI No. APTEL/25/A3079



# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 2 సంచిక: 1 డిసెంబర్ – 2025 పేజీలు: 24

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా

విద్యార్థుల

# మాక్ అసెంబ్లీ..

విజయవంతం



* నైతికవిలువలతోనే సమాజానికి మేలు

* రాష్ట్రవ్యాప్తంగా పండగలా మెగా పీటీఎం 3.0

* ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు ఫిన్లాండ్ నమూనా

# పండగలా
# మెగా పీటీఎం 3.0

రాష్ట్రవ్యాప్తంగా 45,074 పాఠశాలలు, 475 జూనియర్ కళాశాలల్లో డిసెంబర్ 5న 'మెగా పీటీఎం 3.0' కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు,పూర్వవిద్యార్థులు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు సుమారు 74 లక్షల మంది పాల్గొన్నారు. గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు, అసెస్మెంట్ బుక్ లెట్ గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఆర్ట్ & క్రాఫ్ట్, సైన్స్ ప్రాజెక్టులు, FLN లెర్నింగ్ కిట్లు ప్రదర్శించారు. విద్యార్థులు అధ్యయన పురోగతి, హాజరు శాతం, క్రమశిక్షణ వంటి ముఖ్య అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నేరుగా చర్చించారు.

• మెగా పీటీఎం 3.0 కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని ఏపీ మోడల్ స్కూల్లో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గారు, మానవవనరుల అభివృద్ధి కార్యదర్శి శ్రీ కోన శశిధర్ గారు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీ విజయ్ రామరాజు. వి గారు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ బి.శ్రీనివాసరావు గారు , పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నిమ్మక జయకృష్ణ గారు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి గారు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు హాజరయ్యారు.












# మన బడి
## మాస పత్రిక



సంపుటి: 2 సంచిక: 1 డిసెంబర్ – 2025 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**పి.రంజిత్ బాషా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD -1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**అసిస్టెంట్ ఎడిటర్**
**గణపతి రావు బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**చిత్రకారులు**
**మల్లిక్**

## విద్యావికాస వసంతం.. మన బడి వార్షికోత్సవం

*మన బడి 12 నెలలుగా నిరంతరాయంగా నెల నెలా విద్యా వెలుగుల వెన్నెల తెస్తోంది. ఒక ఎడిటర్ గా ఇది నాకు చాలా సంతోష సందర్భం. ప్రభుత్వం, విద్యా శాఖా మంత్రి, పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, సంపాదక బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తల అందరి సహకారంతో మనబడి విజయవంతంగా తొలి వార్షికోత్సవం పూర్తి చేసుకుంది. ఈ తొలి మజిలీ సమష్టి కృషి ఫలితం. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల బహుముఖ ప్రతిభను అందరికి పరిచయం చేసే వేదికగా మనబడి నిలిచింది. వినూత్న విద్యాబోధనతో సంచలనాలు సృష్టిస్తున్న ఉపాధ్యాయుల స్ఫూర్తిమంతమైన విధానాలు ప్రచార వారధి మనబడి. విద్యాశాఖ పథకాలు, ప్రభుత్వ లక్ష్యాలు, విద్యాశాఖ మంత్రి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ ప్రతిబింబించే దర్పణం మనబడి మాసపత్రిక. ఏడాది కాలంలో అందంగా, ఆకర్షణీయంగా, విజ్ఞానవంతంగా మనబడి మాసపత్రికను తీసుకురావడానికి చేసిన కృషిలో భాగమైన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అందరి సహకారం, సూచనలు, సలహాలతో మనబడిని మరింత ప్రయోజనకరంగా తీసుకొస్తాం.*

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/ మరియు cse.ap.gov.in

# ఫిన్లాండ్ నమూనాతో ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్



ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా వ్యవస్థగా పేరుగాంచిన ఫిన్లాండ్ విద్యా నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న "ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్"కు మిళితం చేసి విజయవంతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్య , నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత స్థాయి అధికారులు ఫిన్లాండ్‌లో విస్తృత అధ్యయన పర్యటనను పూర్తి చేశారు.

### ఉన్నతాధికారుల అధ్యయన బృందం

మానవ వనరుల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఐఏఎస్ గారి నేతృత్వంలో డా. నారాయణ భరత్ గుప్తా ఐఏఎస్ (కమిషనర్, కళాశాల విద్య), విజయ్ రామరాజు.వి. ఐఏఎస్ (కమిషనర్, పాఠశాల విద్యాశాఖ), బి. శ్రీనివాసరావు ఐఏఎస్ (రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష), జి. గణేశ్ కుమార్ ఐఏఎస్ (కమిషనర్, సాంకేతిక విద్య & మేనేజింగ్ డైరెక్టర్, APSSDC) , క్రిస్టెల్ కౌమే (సీనియర్ ఎకానమిస్ట్, ప్రపంచబ్యాంకు) అధ్యయన పర్యటన బృందంలో ఉన్నారు. ఈ పర్యటన రాష్ట్ర విద్యా విధానంలో కీలక సంస్కరణలకు నాంది పలుకుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### పాఠశాల విద్యలో సంస్కరణలు: EDUFI తో కీలక ఒప్పందం

పాఠశాల విద్య , సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ (EDUFI), హెల్సింకిలోని వల్లైలా ప్రైమరీ స్కూల్, , అర్హోటీలోని 'డేకేర్ వర్టియోక్యులా'ను సందర్శించి ఫిన్లాండ్‌లోని ఆదర్శ విద్యా సూత్రాలను పరిశీలించారు.

### ఫిన్లాండ్ విద్యా వ్యవస్థలోని ఆదర్శ సూత్రాలు

*** ఉపాధ్యాయులపై విశ్వాసం (Trust in Teachers):**
ఫిన్లాండ్‌లో బోధన అనేది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వృత్తి. ప్రాథమిక ఉపాధ్యాయులకు కూడా 5 సంవత్సరాల మాస్టర్ డిగ్రీ తప్పనిసరి. ఇక్కడ తనిఖీలు (Inspections) లేదా ర్యాంకింగ్‌లు లేవు. ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలు, మూల్యాంకనాలను స్వయంగా నిర్ణయించుకునే పూర్తి స్వయంప్రతిపత్తి (Autonomy) కలిగి ఉంటారు.

*** సమానత్వం (Equity) & సంక్షేమం:**
ఉచిత ప్రాథమిక విద్య, 1943 నుంచీ అమలులో ఉన్న ఉచిత పాఠశాల భోజనం, , ప్రామాణిక పరీక్షలు లేని కేవలం నిర్మాణాత్మక మూల్యాంకన విధానం (Only Formative Assessment) విద్యార్థి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

*** ఆట-ఆధారిత అభ్యాసం (Playful Learning):**

"ఆట అనేది అభ్యాసానికి మాధ్యమం, విరామం కాదు" అనే సూత్రాన్ని అమలు చేస్తున్నారు. పూర్వశిశు విద్య (ECEC) లో 'డాన్సింగ్ మౌస్ ఎమోషన్ బోర్డు' వంటి సాధనాలు పిల్లల భావోద్వేగ అక్షరాస్యతను పెంచుతున్నాయి.

*** పరిపాలనా వికేంద్రీకరణ:**

ప్రిన్సిపాల్‌కు పూర్తి పరిపాలనా అధికారం ఉంటుంది. మున్సిపాలిటీలు నిధులు, మౌలిక సదుపాయాలకు మాత్రమే పరిమితమై బోధనలో



జోక్యం చేసుకోకపోవడం ఇక్కడి విజయ రహస్యం.

### ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్ట్

EDUFI నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం నుండి పునాది విద్య (FLN) వైపు మారాలనే లక్ష్యాన్ని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో, కార్యదర్శి కోన శశిధర్, ఐఏఎస్, జిల్లాకు ఒక అంగన్వాడీ చొప్పున రాష్ట్రంలో ఫిన్నిష్ తరహా 'ఆట-ఆధారిత అభ్యాసం' నమూనాలో పూర్తిగా మార్చేందుకు ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని EDUFI కి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు EDU-



FI పూర్తి మద్దతు ప్రకటించింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పూర్వశిశు విద్యను పటిష్టం చేసి, భవిష్యత్ తరాలకు మెరుగైన పునాదులు వేయడానికి మార్గం సుగమం కానుంది.

**ఉన్నత విద్య, ఆవిష్కరణలు:** నాలెడ్జ్ హబ్ దిశగా కళాశాల విద్య , సాంకేతిక విద్యా అధికారుల బృందం ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాల కోసం ఆల్టో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకి (Uniarts), యూనివర్సిటీ ఆఫ్ టర్కు , హెల్సింకి సెంట్రల్ లైబ్రరీ ఊడి (Oodi) లను సందర్శించింది. "అమరావతి నాలెడ్జ్ సిటీ" స్థాపనలో భాగంగా ఈ అధ్యయనం జరిగింది.

### ప్రధాన పరిశీలనాంశాలు

* **Uniarts (కళల విశ్వవిద్యాలయం):** స్టూడియో ఆధారిత బోధన, ఆడిషన్/పోర్టుఫోలియో ఆధారిత ప్రవేశాలు, మెంటార్‌షిప్ ఆధారిత శిక్షణ , క్రియేటివ్ స్టార్టప్‌ల కోసం ప్రీ-ఇంక్యుబేషన్ హబ్ విధానాలను పరిశీలించారు.

* **ఆల్టో యూనివర్శిటీ (డిజైన్ ఫ్యాక్టరీ):** విభాగాల అనుసంధానం, ఓపెన్ ప్రోటోటైపింగ్ ల్యాబ్స్, స్టార్టప్‌లకు మెంటారింగ్ వ్యవస్థ , ఆవిష్కరణలను పెంచే "స్పేస్ అస్ పెడగోగీ" విధానం గురించి తెలుసుకున్నారు.

* **యూనివర్శిటీ ఆఫ్ టర్కు:** ఉపాధ్యాయ విద్య నాణ్యత , టీచర్ ట్రైనింగ్ మోడల్‌పై దృష్టి సారించారు.

* **ఊడి (Oodi) లైబ్రరీ:** సాంకేతికతతో కూడిన, సమాజ కేంద్రీకృతమైన ఈ లైబ్రరీ, అమరావతిలో ప్లాన్ చేస్తున్న నాలెడ్జ్ హబ్ కోసం ఒక బెంచ్‌మార్క్ కానుంది.

### APSSDC – విదేశీ ఉపాధిపై దృష్టి

సాంకేతిక విద్య , APSSDC బృందం ఎకో ఇంజనీరింగ్ (Echo Engineering) సంస్థతో సమావేశమై ఫిన్లాండ్‌లోని మార్కెట్ అవసరాలను అంచనా వేసింది.

* **ఉద్యోగ నియామకాలు:** దళారులు లేకుండా, ఎటువంటి రుసుములు లేకుండా, ప్రత్యక్ష నియామకాలు జరుగుతాయి.

* **సమానత్వం:** వలస కార్మికులకు సమాన వేతనం, భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉండటం తప్పనిసరి.

* **అవసరాలు:** సాంకేతిక నైపుణ్యంతో పాటు, ప్రాథమిక ఆంగ్ల భాషా పరిజ్ఞానం సరిపోతుంది. ఉద్యోగంలో చేరడానికి ముందు ధృవీకరణ పత్రాలు, ప్రాక్టికల్ స్కిల్ టెస్టులు, శీతల వాతావరణానికి సన్నద్ధత తప్పనిసరి.

ఈ సమాచారం ఆధారంగా, APSSDC ఫిన్లాండ్‌కు వెళ్లే అభ్యర్థుల కోసం సాంకేతిక శిక్షణ, భాషా నైపుణ్యాలు, సాంస్కృతిక అవగాహన, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక 'విదేశీ ప్లేస్‌మెంట్ సన్నద్ధతా మాడ్యూల్స్' రూపొందించనుంది.

ఈ పర్యటన ద్వారా అందిన విలువైన పద్ధతులు, ఉత్తమ విధానాలు, ఆచరణాత్మక వ్యూహాలను అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా:

1. ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు , ఇన్నోవేషన్ స్ప్రింట్‌లు నిర్వహించడం.

2. డిజైన్ ఫ్యాక్టరీ నమూనా ఆధారంగా పైలట్ ప్రాతిపదికన ప్రోటోటైపింగ్ హబ్‌లను ఏర్పాటు చేయడానికి సంస్థలను గుర్తించడం.

3. EDUFI మద్దతుతో ఫిన్నిష్ అవసరాలకు అనుగుణంగా APSSDC నైపుణ్యాభివృద్ధి శిక్షణను మార్చడం.

ఈ అధ్యయన పర్యటన, ఆంధ్రప్రదేశ్ విద్యా చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవనుందని, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణల రంగాల్లో దేశానికి ఆదర్శంగా ఏపీ నిలుస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

★★★

## ఫిన్లాండ్ విద్యా విప్లవం: ఆంధ్రప్రదేశ్ భవితకు మార్గదర్శి

భారతదేశంలో పుష్కలమైన వనరులున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగి ఉన్న మన దేశం, సరైన విద్య, నైపుణ్యాలు, దార్శనిక విధానాలతో తీర్చిదిద్దితే, ప్రపంచంలోనే అగ్రగామి GDP మరియు నిర్ణయాత్మకమైన ప్రపంచ నాయకత్వ స్థానానికి చేరుకోగలదు. 'విశ్వగురువు'గా ఎదగాలనే మన లక్ష్యంలో, విద్యే మన అత్యంత శక్తివంతమైన సాధనం.

ఈ నేపథ్యంలోనే, ప్రపంచ బ్యాంకు మద్దతుతో ఆంధ్రప్రదేశ్ నుండి ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఫిన్లాండ్ లో పర్యటించింది. ప్రపంచంలో అత్యంత సమర్థవంతమైన విద్యావ్యవస్థ కలిగిన దేశంగా ఫిన్లాండ్ పర్యటన ద్వారా అధ్యయన బృందం గ్రహించిన అంశాలు ఇవి..

### 1. సమానత్వం & ఉచిత విద్య

* విద్య రాజ్యాంగ హక్కు: ఇది పూర్తిగా ఉచితం. అందరికీ అందుబాటులో ఉంటుంది.

* ప్రైవేట్ పాఠశాలల ఆధిపత్యం లేదు: ఆర్థిక అడ్డంకులు, సంస్థల మధ్య హోదా వ్యత్యాసాలు లేవు. ప్రతి పాఠశాల సమానంగా నాణ్యతతో ఉండాలని భావిస్తారు.

2. ఉపాధ్యాయుల స్వయంప్రతిపత్తి & అత్యున్నత ప్రమాణాలు

* ఉన్నత వృత్తి: ఫిన్లాండ్ లో ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైంది.

* ఉత్తమ అర్హతలు: ఉపాధ్యాయులు 5 సంవత్సరాల మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేస్తారు. వారికి పూర్తి స్వయంప్రతిపత్తి ఉంటుంది.

o ✗ తనిఖీలు (Inspections) లేవు.

o ✗ ర్యాంకింగ్‌లు (Rankings) లేవు.

o ✗ పనితీరు ఆధారిత ఒత్తిడి (Performance-based pressure) లేదు.

3. ఆనందకరమైన, ఒత్తిడి లేని అభ్యాసం

* అభ్యాసం ఆలస్యం: 7 సంవత్సరాల వయస్సు వరకు అధికారిక పాఠశాల విద్యను ఆలస్యం చేస్తారు. 14 ఏళ్ల వరకు ప్రామాణిక పరీక్షలను నిర్వహించరు.

* కీలక అంశాలు: అభ్యాసం ఆట ఆధారితంగా, సంపూర్ణంగా, భావోద్వేగంగా సురక్షితంగా మరియు కంఠస్థం (rote learning) నుండి విముక్తిగా ఉంటుంది.

* NEP 2020కి అనుగుణం: బట్టీ చదువులు కాకుండా లోతైన అవగాహనపై దృష్టి సారిస్తుంది.

4. వృత్తి విద్య మరియు జీవిత నైపుణ్యాలు

* చిన్నప్పటి నుంచే నైపుణ్యం: ప్రాథమిక తరగతుల నుంచే కుట్లు, అల్లిక, చేతిపనుల ఆధారిత సమస్యల పరిష్కారాన్ని విద్యలో అనుసంధానిస్తారు.

*మిగతా 11వ పేజీలో...*



# నైతిక విలువలతోనే విద్యా వికాసం

– 'విలువల విద్యాసదస్సు'లో
ప్రవచన వాచస్పతి బ్రహ్మశ్రీ **చాగంటి కోటేశ్వరరావు**



నైతిక విలువలతో కూడిన విద్యతోనే సమాజానికి మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారులు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో నిర్వహించిన 'విలువల విద్యాసదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

## అమ్మకు తొలి వందనం

`` విద్య గురించి ప్రవచిస్తూ నాకు ఈ కర్తవ్యాన్ని అప్పగించినప్పుడూ సీఎం గారు నాతో ఒక మాట అన్నారు. నైతికత అనేది కుటుంబంలో ప్రారంభం కావాలని అన్నారు. తల్లి మాట వినడం, తండ్రి మాట వినడం, అన్నదమ్ములను ప్రేమించడం ప్రారంభమైతే.. సమాజాన్ని ప్రేమించడం తనంత తానుగా ప్రతీ ఒక్కరికీ అలవాటవుతుంది. ఇవాళ కుటుంబాల్లో విలువలు తగ్గిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, అవగాహన తగ్గిపోతోంది. కుటుంబ, నైతిక విలువలు పెరగడానికి దోహదపడే విధంగా మీ ప్రవచనాలు, ప్రసంగాలు చేయాలని సీఎం గారు కోరారు. కుటుంబం, విలువలు గురించి ప్రవచనం చేస్తాను. అమ్మ అంటే ప్రేమైక మూర్తి. అమ్మలాంటి వ్యక్తి జీవితంలో ఇక దొరకదు. జీవితంలో అన్నిటికన్నా పెద్ద నేరం ఏమిటంటే.. అమ్మకు చెప్పలేము అన్న పని మనం చేయడమే. ఏం పని మనం చేస్తామో ఆ పని అమ్మకు చెప్పగలగాలి. అమ్మకు చెప్పలేని పని జీవితంలో మీరు ఎప్పుడూ చేయకూడదు. భగవంతుడు ఎంతో అమ్మ కూడా అంతే. మహాత్ముల జీవిత చరిత్ర ఎవరిది పరిశీలించినా అమ్మకు నమస్కార చేయకుండా, అమ్మ గొప్పతనం చెప్పకుండా ఎవరూ లేరు. ప్రకాశం పంతులు గారు, ఏపీజే అబ్దుల్ కలాం గారు, ప్రధాని నరేంద్ర మోదీ గారు, సీఎం చంద్రబాబు గారు అమ్మ గొప్పదనం గురించి చెప్పారు. ఈ జాతి మొదటి లక్షణం అమ్మను గౌరవించడం. మాతృదేవో భవ. అందరూ అమ్మను గౌరవించడం నేర్చుకోవాలి, అమ్మకు నమస్కారం చేయాలి. పాఠశాలకు వచ్చేప్పుడు అమ్మకు నమస్కారం చేయండి.

## తండ్రి దైవంతో సమానం

మన కంటికి కనపడని భగవంతుడు తండ్రి రూపంలో ఉన్నాడు. తండ్రిని జీవితాంతం దైవంతో సమానంగా చూడాలి. పిల్లల బాగు కోసం ఏ త్యాగం చేయడానికైనా తండ్రి సిద్ధంగా ఉంటాడు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన అబ్రహాం లింకన్ గారు, లతా మంగేష్కర్ గారు తండ్రి గొప్పదనం గురించి ఎన్నో సందర్భాల్లో చెప్పారు. తండ్రి మాటను పెడచెవిన పెట్టవద్దు. తల్లిదండ్రుల మాట వినడం నేర్చుకుంటే మీకు నైతిక విలువలు చాలా అలవాటవుతాయి. తోబుట్టువులను ప్రేమించాలి. తన సోదరుడి గురించి ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఎన్నో సందర్భాల్లో చెప్పారు. తల్లి, తండ్రి, గురువు ఎంత గొప్పవారో తోడబుట్టిన వారు అంత గొప్పవారు. వారిని ప్రేమించాలి, గౌరవించాలి. పెద్దలను, గురువులను



గౌరవించాలి. తరగతి గదిని కేవలం పాఠాలు చదువుకోవడానికే కాకుండా.. సమాజాన్ని ఉద్ధరించడానికి విద్య ఉపయోగపడాలి.



## గురువు గొప్పతనం

తల్లి, తండ్రి తర్వాత అంత వెంపర్లాడే వ్యక్తి గురువు ఒక్కరే. విద్యార్థులు వృద్ధిలోకి వస్తే సంతోషపడే వ్యక్తి గురువు అని చాగంటి కోటేశ్వరరావు గారు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

విలువల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రవచన వాచస్పతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి కాళ్లకు నమస్కారం చేసి పెద్దల పట్ల తన గౌరవ భావాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గారు చాటుకున్నారు.

## నైతిక విలువల ద్వారానే ఉత్తమ పౌరులు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి సూచనలు, సలహాలు, పర్యవేక్షణలో ఈ నైతిక విలువలు పుస్తకాలు రూపొందించాం. సులువైన భాషలో పిల్లలకు అర్థమయ్యేలా టీచర్లు బోధిస్తున్నారు. కానీ అది సరిపోదు. మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలి. పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. మహిళలు, పెద్దలను గౌరవించాలని, స్త్రీ పురుషులు సమానమనే భావన పిల్లల్లో పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా మనపై ఉంది.

అనేక సవాళ్లు ఉన్న విద్యాశాఖను ఏరికోరి తీసుకున్నాను. తరతరాలుగా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలలో చాలా వాటిని పరిష్కరించాం. టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చాం. 9,600 పాఠశాలల్లో వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేశాం. ఒక్క లిటిగేషన్ లేకుండా కేవలం 150రోజుల్లో మెగా డిఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశాం. కెజి నుంచి పిజి వరకు కరిక్యులమ్ ప్రక్షాళన చేస్తున్నాం. పిల్లలకు అందించే బ్యాగులు, పుస్తకాలు, బెల్ట్ లపై రాజకీయపరమైన రంగులు, పేర్లు లేకుండా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరుతో విద్యార్థులకు కిట్స్ అందించాం. డొక్కా సీతమ్మ గారి పేరుతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రతిశనివారాన్ని నో బ్యాగ్ డే గా ప్రకటించాం. ఇన్ని చేస్తున్న ప్రభుత్వం పిల్లలు, వారి తల్లితండ్రులను ఒకటే కోరుతోంది. సమాజంలో నైతిక విలువలు పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. కేవలం ఉపాధ్యాయులు, పిల్లలతోనే కాకుండా ప్రజలను కూడా భాగస్వాములను చేసి చైతన్యం తీసుకురావాలి. గురువులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి దిశానిర్దేశంలో విలువలు విద్యా సదస్సులు రాష్ట్రమంతా నిర్వహించాలనుకుంటున్నాం.

– విద్యా శాఖా మంత్రి
**నారా లోకేశ్**





## పిల్లల ప్రశ్నలు.. జవాబులు

విలువలు విద్యా సదస్సుకు వచ్చిన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, మంత్రి నారా లోకేష్ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు.







# భళీరా.. జాదూయి పిటారా..
## ఆట పాటల పాఠాల అద్భుత పెట్టె






ई जादुई पिटारा

పాఠశాలలో వున్న ప్రాథమిక స్థాయి చిన్నారులకు ఆటలు, పాటలు, రంగులతో నిండిన ఒక అద్భుత ప్రపంచం కళ్ల ముందు ఉంచడానికి అందిస్తున్న పెట్టెనే “జాదూయి పిటారా” అని అంటున్నాం.

బోధనలో బొమ్మలు, చార్టులు, వివిధ రకాల అక్షరాల కార్డులు వంటి వాటిని ఉపయోగించినప్పుడు, పాఠాలు వారికి ఒక ఆటలా అనిపిస్తాయి. అక్షరాలు, సంఖ్యలు, కొత్త భావనలను చూడడం, తాకడం ద్వారా నేర్చుకుంటారు. TLM ద్వారా నేర్చుకునే ప్రక్రియలో వారు చురుగ్గా పాల్గొని, అపరిమితమైన ఉత్సాహాన్ని, సంతోషాన్ని వ్యక్తపరుస్తారు. ఈ మెటీరియల్ వారి సృజనాత్మకతను పెంచి, తరగతి గదిని నవ్వుల తోటగా మారుస్తుంది.

జాదూయీ పిటారా' అనేది భారతదేశంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) రూపొందించిన ఒక వినూత్నమైన విద్యా సామగ్రి సెట్. దీనిని ప్రత్యేకంగా జాతీయ విద్యా విధానం 2020 (NEP 2020) లోని ప్రాథమిక స్థాయి (Foundational Stage) విద్యార్థుల కోసం, అంటే 3 నుంచి 8 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం తయారు చేశారు. దీని ద్వారా పిల్లల్లో సమగ్ర వికాసం ,అంటే శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ , జ్ఞానాత్మక వికాసం , భాషా నైపుణ్యాలు పెంపొందించవచ్చు.

### జాదూయీ పిటారా కిట్ లో ఏమేమి ఉంటాయంటే..

**1. Jaadui Pitara- kit manual:** అసలు ఈ Jaadui Pitara లో ఏమేమి వస్తువులు వున్నాయో ,వాటిని ఎలా ఉపయోగించాలో చిత్రాలతో సహా వివరంగా తెలియజేసే మాన్యువల్ కిట్ లో ఉంటుంది.

**2. Jaadui Pitara Kit box:** కిట్లో వస్తువులు జాగ్రత్త చేసుకోవడానికి ఆకర్షణీయమైన చెక్క పెట్టె ఇచ్చారు. వస్తువులు వాడిన తరువాత మళ్ళీ జాగ్రత్తగా పెట్టెలో భద్రపర్చడం పిల్లలకు నేర్పించండి.

**3. Tambourine, 4. Flute, 5. Damru:**పిల్లలకు సంగీతం పట్ల మక్కువ కలిగించడానికి,గ్రహణ శక్తిని అభివృద్ధి చేయడానికి ,ధ్వనుల మధ్య తేడాను కనుగొనడానికి ఈ సంగీత పరికరాలను ఉపయోగించవచ్చు



**6.Big ball:** పిల్లలకు శారీరక ఎదుగుదలకు, స్థూల, సూక్ష్మ కండరాలు బలపడటానికి ఈ bigball ను ఉపయోగించవచ్చు. ఈ బాల్ చాలా సాఫ్ట్ గా వుంటుంది , ఈ బాల్ పై English alphabets ముద్రించబడి వుంటాయి. ఈ బాల్ ఉపయోగించి పిల్లలకు alphabets ను కూడా నేర్పించవచ్చు .



**7.Rope Ladder:** రోప్ లాడర్ ఎక్కడం పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తారు, వారి కండరాలు బలపడతాయి. దీనిని తరగతి గదిలో సురక్షితంగా తగిలించి టీచర్ పర్యవేక్షణలో పిల్లలను ఆడించాలి.



**8. Building blocks:**ఈ బిల్డింగ్ బ్లాక్స్ ద్వారా పిల్లల్లో మేధాభివృద్ధి జరుగుతుంది . ఈ బ్లాక్స్ తో పిల్లలు అనేక రకాల ఆకారాలను తయారు చేయవచ్చు.



**9.Bowling set:** ఈ సెట్ లో బౌలింగ్ పిన్నులు, బౌలింగ్ బాల్ ఉంటుంది. పిల్లల్లో ఏకాగ్రతను పెంచడానికి, కంటి-చేతి సమన్వయానికి ఈ ఆటను పిల్లలతో ఆడించవచ్చు.



**10.Beads with big holes and string:** పెద్ద పెద్ద రంగుల పూసలు ఒక తాడుకు ఎక్కించడం, పూసలను వాటి రంగులను బట్టి వేరు చేయమని చెప్పవచ్చు.



**11.Spinning Top (chakri):** ఈ బొంగరంతో పిల్లలు ఆడితే వారి ఏకాగ్రత పెరుగుతుంది.



**12.Hammering toy:** చెక్కతో తయారైన రంధ్రాల బోర్డు,చిన్న కర్ర ముక్కలు,చెక్క సుత్తి ఉంటుంది. పిల్లల భావోద్వేగాల నియంత్రణకు, ఏకాగ్రతకు ఉపయోగపడుతుంది.



**13.Lacing board With 4 strings:** పిల్లల్లో ఏకాగ్రత పెంచడానికి ఈ లేసింగ్ బోర్డు బాగా

ఉపయోగపపడుతుంది. సూక్ష్మ కండరాల అభివృద్ధి కూడా జరుగుతుంది. Alphabets ,numbersను కూడా ఈ బోర్డు పై పెట్టించవచ్చు.




**14. My Feely bag with solid shapes:** పిల్లల్లో స్పర్శ జ్ఞానం పెరగడానికి,వివిధ ఆకారాలను గుర్తించడానికి ఈ feely bag ను ఉపయోగించవచ్చు.

**15.Self corrective Relationship puzzles:** పిల్లల్లో సునిశిత పరిశీలనా శక్తిని పెంపొందించడానికి, వస్తువుల మధ్య సంబంధాన్ని తెలియ చేయడానికి,తార్కిక ఆలోచనను మెరుగుపరచడానికి ఈ puzzles ను వాడవచ్చు.



**16. Puzzles of 2,3,5 & 6 pieces :** ఇవి 2,3,4,5,6,ముక్కల బొమ్మల puzzles. వీటిలో జంతువులు, పక్షులు, పండ్లు చిత్రాలు ఉంటాయి. ఈ Puzzles పెట్టడం ద్వారా పిల్లల్లో సమస్యా పరిష్కార నైపుణ్యాలు పెరుగుతాయి. వారి ఆలోచనను , ఊహా శక్తిని ప్రేరేపిస్తాయి.



**17.Nesting / stacking rings:** వస్తువులను క్రమ పద్ధతిలో అమర్చడం అనే పూర్వ గణిత భావనను పిల్లల్లో పెంపొందించడానికి ,రంగులను గుర్తించడానికి ఈ stacking rings చాలా బాగా ఉపయోగపడతాయి.



**18.Junior abacus:** ఈ abacus ద్వారా పిల్లల మెదడును ఉత్తేజపరచి ప్రాథమిక సంఖ్యా నైపుణ్యాలైన లెక్కపెట్టడం,కలపడం,తీసివేయడంలను అభివృద్ధి చేయవచ్చు.



**19.English sound Dominos:** పిల్లలకు ధ్వనుల ఆధారంగా అక్షరాలను నేర్పడానికి ఈ కార్డ్స్ ను ఉపయోగించవచ్చు .



**20.Cloth dolls (one boy and one girl) 21.glove Puppets:** పిల్లల భావ వ్యక్తీకరణ, roleplay కోసం వీటిని ఉపయోగించాలి. వీటి ద్వారా పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం నేర్చుకుంటారు.




**22.Kitchen set:** పిల్లలకు కిచెన్ సెట్ తో ఆడడం అంటే చాలా సరదాగా వుంటుంది. ఈ ఆట వారి సృజనాత్మకత , ఊహాశక్తిని అభివృద్ధి చేస్తుంది.



**23.Rolling board and rolling pin (chakla-belan):** పిల్లల్లో సూక్ష్మ కండరాల అభివృద్ధికి, సృజనాత్మకతను పెంచడానికి ఇది ఉపయోగపడుతుంది.




**24.Aphabet Tracing board:** పిల్లల్లో కంటి–చేతి సమన్వయం నైపుణ్యాలను బలపరచడానికి,వేళ్ళు , చేతి కదలికలను కచ్చితంగా అభివృద్ధి చేయడానికి (రాయడానికి ముందు అవసరమైన నైపుణ్యం),దృష్టి సారించే శక్తిని , ఏకాగ్రతను పెంచడానికి ఈ tracing బోర్డు ను వాడవచ్చు .



**25.Folding bag:** ఈ ఫోల్డింగ్ బాగ్ లో అనేక అరలు ఉంటాయి . వాటిలో టీచర్ తరచుగా వాడే flashcards ,చిన్న కథల పుస్తకాలు వంటి వాటిని పెట్టి గోడకు తగిలించవచ్చు.



**26.Solid shapes: Velcro solid shapes of 7 types:** పిల్లలకి ఘనాకారాలను పరిచయం చేయడానికి ఈ shapes ఉపయోగపడతాయి. నిజజీవితంలో వారి పరిసరాలలో ఉండే ఆకారాలను geometrical shapes తో సరిపోల్చడం అనే భావనను పెంపొందించవచ్చు.



**27.Tiles of five types and trays of two types:** వివిధ 2D ఆకారాల లక్షణాలను గమనించడం కోసం, పిల్లలు తమ స్వంత నమూనాలను (ప్యాటర్న్)తయారుచేయగలిగేలా చేయడం కోసం, స్థలం, విస్తీర్ణం గురించి సహజమైన అవగాహన పెంపొందించడం కోసం, వర్గీకరణ (క్లాసిఫికేషన్), లెక్కించే (కౌంటింగ్) నైపుణ్యాలను బలపరచడం కోసం ఈ టైల్స్ ను ఉపయోగించవచ్చు.

**28.Place value cards (3 items) :** సంఖ్యలనువాటి స్థాన విలువ (ప్లేస్ వాల్యూ) ఆధారంగా వర్గీకరించడం కోసం, లాజికల్ థింకింగ్, రీజనింగ్ అభివృద్ధి చేయడం కోసం, సంఖ్యలను "పదులు", "ఒకట్ల" రూపంలో



అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం ఈ కార్డులను ఉపయోగించవచ్చు .

**29. English alphabet card:** పిల్లలు అక్షరాలు తేలిగ్గా గుర్తించడానికి,అక్షరాలు వాటి ధ్వనులను సమన్వయ పరుచుకోడానికి, పదాజాలాన్ని పెంపొందించుకోడానికి ఈ ఆల్ఫబెట్ కార్డ్స్ ను ఉపయోగించవచ్చు .



**30.English alphabet small and capital tracing card:** ఇంగ్లీషు లో క్యాపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్ గుర్తించడానికి, వాటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడానికి, వాటిని తేలిగ్గా రాయడం నేర్పించడానికి ఈ tracing cards


ను ఉపయోగించవచ్చు .




**31. Classification card:** జంతువులు, పక్షులు, కాయగూరలు, పండ్లు చిత్రాలతో కూడిన కార్డులు దీనిలో వుంటాయి. వాటిని వర్గీకరించడం నేర్పించడానికి ఈ కార్డులను ఉపయోగించవచ్చు.



**32. Number Tracing cards:** పిల్లలకు అంకెలను రాయడం నేర్పడానికి ఈ tracing cards ను ఉపయోగించవచ్చు.



**33. Number Domino cards:** అంకెకు సరిపడు చుక్కలను లెక్కించి జత చేయడానికి ఈ Number Domino cards ను ఉపయోగించవచ్చు.

**34. Alphabet flash cards:** పిల్లలకు ఆల్ఫబెట్ (క్యాపిటల్ లెటర్స్, స్మాల్ లెటర్స్) నేర్పించడానికి చిత్రాలతో కూడిన ఈ flash cardsను ఉపయోగించవచ్చు.



**35. Anand- Activity book:** పిల్లల్లో సమగ్ర అభివృద్ధికి దోహదపడే అనేక వర్క్ షీట్లు ఈ బుక్ లో ఉన్నాయి. వాటిని సందర్భానుసారంగా తరగతి గదిలో ఉపయోగించవచ్చు .




**36. Picture reading posters set:** పిల్లల్లో పరిశీలనా శక్తిని మెరుగుపరచడానికి, పదజాలాన్ని అభివృద్ధి చేయడానికి, వారి భావ వ్యక్తీకరణకు ఈ పోస్టర్లను ఉపయోగించవచ్చు .



**37. Telugu Sound dominos, 38. Telugu varnamala cards, 39. Telugu Varanmala Tracing cards :** తెలుగు అక్షరాలను ధ్వని ఆధారంగా పిల్లలకు రాయడం, చదవడం నేర్పడానికి ఇవి చాలా చక్కగా ఉపయోగించుకోవచ్చు.



**40.Story sequence cards (Bilingual Eng/Tel):** ఇవి 5 కథలు, ప్రతి కథకి 5 కార్డులు ఉంటాయి. వినే, మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ కార్డులను ఉపయోగించవచ్చు .

**41. Memory cards (Bilingual Eng/Tel):**




వస్తువులను గుర్తించడానికి, పరిశీలనా శక్తిని పెంచడానికి ఈ కార్డులను ఉపయోగించవచ్చు.

**42. Sequential thinking cards (Bilingual Eng/Tel):** ఏది ముందు వస్తుంది? ఏది తర్వాత వస్తుంది? అని పిల్లలు ఆలోచించి నిర్ణయం తీసుకోడానికి ఈ కార్డులను ఉపయోగించవచ్చు.

**43.Colour seriation cards (Bilingual Eng/Tel):** రంగుల్లో వుండే వివిధ వర్ణాలను గుర్తించడానికి, పరిశీలనా శక్తిని పెంచడానికి ఈ కార్డులను ఉపయోగించవచ్చు .



**44.Joker cards (Bilingual Eng/Tel):** ఈ కార్డుల ద్వారా పిల్లలకు రంగులు, హావభావాలు, ఆకారాలు లాంటి అనేక విషయాలు నేర్పించవచ్చు.

**45.Pre number concept cards (Bilingual Eng/Tel):** గుర్తించడం, పేర్లు చెప్పడం, క్రమపరచడం ద్వారా పెద్ద – చిన్న, మందం –




పలచన, ఎత్తు – లోతు, పొడవు – పొట్టి ,దగ్గర – దూరం,

వంటి గణిత ప్రాథమిక భావనలను పిల్లలకు నేర్పించవచ్చు.

**46.Story card-kahani card (Bilingual Eng/Tel):** ఇవి పిల్లలే చూసి కథ చెప్పడానికి వీలుగా వుంటాయి. చదవగలిగే పిల్లలకు చిన్న,చిన్న వాక్యాలు కూడా ఇందులో ఉన్నాయి.

**47.What is missing cards (Bilingual Eng/Tel):** ఈ కార్డుల ద్వారా పిల్లల్లో ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

**48-53. Falon ki mauj , Gehoon ka safar, Makdi ki aankhein, Maa ki almaari, Mast kalandar, Rangon se bhara samundar, (Bilingual Eng/Tel):** ఇవన్నీ రంగురంగుల



పోస్టర్లు. ఇవి ఉపయోగించి పిల్లలకు పాటలు నేర్పించవచ్చు,వారితో ఎక్కువగా మాట్లాడించవచ్చు.

**54-55. Varnmala-అచ్చులు, Varnmala-హల్లులు:** పిల్లలకు అచ్చులు, హల్లులు, సరళ పదాలు నేర్పించడానికి ఈ చార్టులను ఉపయోగించవచ్చు.

**56. Large shapes sorter board with strings:** పిల్లలకు జ్యామితీయ ఆకారాలైన circle, triangle, square, rectangle ను ఆట రూపంలో పరిచయం చేయవచ్చు.

**56.Barkha Sets of 40 Books (Bilingual Eng/Tel):** ఇవి కథల పుస్తకాల సెట్టు. ఇందులో 40 పుస్తకాలు మంచి చిత్రాలతో, సరళ పదాలతో కూడిన వాక్యాలతో ఉంటాయి. పిల్లలకు చాలా ఆసక్తికరంగా కథలను చెప్పవచ్చు.

**57-58. Firki Bachhon ki- December 2023, జూన్ 2023 (Bilingual Eng/Tel):** ఇవి పిల్లలు రాసిన కవితలు,కథలతో కూడుకున్న పత్రిక.

**59.Vanishing frog-Magic trick (Bilingual Eng/Tel):** మ్యాజిక్ అంటే ఇష్టపడని పిల్లలు ఉండరు. వారికి సరదాగా అనిపించే చిన్న మ్యాజిక్ కార్డ్ ఇది.

**61.Anand loose worksheets (Bilingual Eng/Tel):** ఇవి పిల్లలు వ్యక్తిగతంగా చేసుకునే అభ్యాస పత్రాలు. వెనుకబడిన పిల్లలకు ఇవి బాగా ఉపయోగపడతాయి.

**62.UNMUKH- Balvatika (English):** ప్రాథమిక స్థాయి పిల్లల్లో సమగ్ర విద్యా వికాస అభివృద్ధిని కలిగించడానికి టీచర్లకు ఉపయోగపడే అనేక కృత్యాలు ఇందులో ఇచ్చారు.

**E-JADYUI PITARA:** జాదూయి పిటారా appను మన మొబైల్ లో ప్లేస్టోర్ నుంచి కూడా డౌన్లోడ్ చేసుకోవచ్చు. E-JADYUI PITARA Whatsapp నెంబర్ 9599961445 ద్వారా మనకు కావలసిన కథలు,పాటలు ఇవ్వమని చాట్ చేయవచ్చు. పిల్లలకు ఒత్తిడిలేని, ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆటపాటలతో విద్యను అందిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు జాదూయి పిటారా ఎంతో ఉపయోగపడుతుంది.

– **కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, శామో

*5వ పేజీ తరువాయి....*



* వృత్తి విద్య గౌరవం: 9వ తరగతి తర్వాత 50% మంది విద్యార్థులు వృత్తి విద్య మార్గాలను ఎంచుకుంటారు. శ్రమ గౌరవం మరియు నైపుణ్యాల సృష్టికి ప్రాధాన్యత ఇస్తారు.

## ఉత్తమ విద్యావిధానం వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు

మారుతున్న కాలానికి అనుగుణంగా, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రూపొందించడంలో పురోగతి సాధించింది. ఫిన్లాండ్ అధ్యయన పర్యటనతో ఉన్నతాధికారులు విద్యా వ్యవస్థను దేశానికే మోడల్ గా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు అమలు చేయనున్నారు.

1. అంగన్వాడీల మార్పుకు ఫిన్లాండ్ ECEC నమూనా ఫిన్లాండ్లోని ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ (ECEC) నమూనా APకి మార్గనిర్దేశనం చేస్తుంది.

* ఆట ఆధారిత పాఠ్యాంశాల పరిచయం.

* అంగన్వాడీ ఉపాధ్యాయులకు వృత్తిపరమైన శిక్షణ.

* మాతృభాష, ద్విభాషా మార్గాలను బలోపేతం చేయడం.

* ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్: ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం జిల్లాల్లో ఫిన్నిష్-నమూనా అంగన్వాడీ కేంద్రాల ప్రతిపాదన ఒక విప్లవాత్మకమైన ముందడుగు.

ఉపాధ్యాయులలో ప్రేరణ,స్వయంప్రతిపత్తి, సాధికారత కల్పించేందుకు ఫిన్నిష్ నిపుణులు ఇచ్చిన సలహాలు ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎంతో ఉపయోగపడతాయి.

వృత్తి విద్యను అకడమిక్ విద్యతో సమానంగా చూసి అమలు చేయడం వల్ల ఫిన్లాండ్ లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని మన రాష్ట్రంలో వృత్తి విద్యా ప్రయోగశాలలను పెంచడం, చిన్న వయస్సు నుంచే నైపుణ్యాల పరిచయం (అల్లిక, డిజైన్, థింకింగ్) చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని అధ్యయనం ద్వారా వెల్లడైంది.

### విశ్వవిద్యాలయాలలో ఇన్నోవేషన్ హబ్స్

ఆల్టో యూనివర్సిటీలోని 'డిజైన్ ఫ్యాక్టరీ' నమూనా నుండి ప్రేరణ పొంది ప్రోటోటైపింగ్ ల్యాబ్‌లు, ఇంటర్నల్ స్టూడియోలు, అమరావతి నాలెడ్జ్ సిటీ వంటి ప్రాజెక్టులలో విద్యార్థి నేతృత్వంలోని వ్యవస్థాపకతను అభివృద్ధి చేయవచ్చు.

ఫిన్లాండ్ స్నేహహస్తం

ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ (EDU-FI) ఆంధ్రప్రదేశ్ కు కలిసి సహకరించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. పాఠ్యాంశాల సహ-రూపకల్పన, ఉపాధ్యాయ శిక్షణ & పాఠశాల నాయకత్వం, ఉన్నత విద్యలో ఆవిష్కరణలు & ఉమ్మడి పరిశోధనా ల్యాబ్‌లు అభివృద్ధి చేయడానికి సహకారం అందించేందుకు సుముఖత వ్యక్తం చేసింది.

### విజయానికి కారణాలివే..

ఒక దేశం తనిఖీ కంటే నమ్మకానికి, ఒత్తిడి కంటే సంక్షేమానికి, కంఠస్థం కంటే సృజనాత్మకతకు, పోటీ కంటే సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తే ఏమి సాధించవచ్చో ఫిన్లాండ్ చేసి చూపింది. ఫిన్లాండ్ నిరంతర సహకారంతో భారతదేశంలోనే అత్యున్నతమైన విద్యా వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రథమస్థానంలో నిలబెట్టే కృషి మొదలైంది.

– **యశ్వంత్ దివి,** Consultant, PwC, విజయవాడ



# విద్యార్థుల అసెంబ్లీ విజయవంతం


* రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ
* పోటీల్లో ఎంపికైన 175 నియోజకవర్గాల విద్యార్థులతో నిర్వహణ
* మాక్ అసెంబ్లీని వీక్షించి ప్రశంసించిన సీఎం, స్పీకర్, మంత్రులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యాశాఖలో సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించే తత్వం పెంపొందించేలా చేయాలని అసెంబ్లీలో గత ఏడాది చెప్పిన మాటను నిలబెట్టుకున్నారు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న అమరావతి, సచివాలయం ఆవరణలో శాసనసభ సెట్ వేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు.

## గౌరవసభలా..

అధికార, విపక్ష ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి హాజరైతే ఎంత అర్థవంతమైన చర్చలు జరుగుతాయో మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థులు ప్రదర్శించారు. సభా గౌరవాన్ని కాపాడుతూ.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో తెలియజెప్పారు. నిజమైన ప్రభుత్వం, ప్రతిపక్షం, శాసనసభ్యుల మాదిరిగానే అద్భుతంగా సభను నిర్వహించారు. ప్రశ్నోత్తరాల్లో అనుబంధ ప్రశ్నల అవకాశాన్ని సభ్యులు ఎలా వినియోగించుకోవాలి ? జీరో అవర్ లో ప్రజా సమస్యలను ఎలా లేవనెత్తాలి? బిల్లుని ఎలా ప్రవేశ పెట్టాలో మాక్ అసెంబ్లీ ద్వారా చెప్పారు.

పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన మాక్ అసెంబ్లీకి 175 నియోజకవర్గాల నుంచి 175 మంది విద్యార్థులను పాఠశాల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ చూపించిన వారిని ఎంపిక చేశారు. వీరిలో 26 మంది మంత్రులు, సభాపతి, ప్రొటెం స్పీకర్ గా వ్యవహరించారు. సభాపతిగా కాకినాడ జిల్లాకు చెందిన స్వాతి సభను బాగా నడిపించారు. మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలాగౌతమ్ ముఖ్యమంత్రిగా, ఎల్. సౌమ్య ప్రతిపక్ష నేతగా, ఉపముఖ్యమంత్రిగా విశాఖపట్నం జిల్లాకు చెందిన కోడి యోగి వ్యవహరించారు. విద్యార్థులంతా.. తామే మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నట్టుగా సభను నడిపించి, దిగ్విజయంగా పూర్తిచేశారు. ప్రశ్నలు అడగడంలో, సమాధానం ఇవ్వడంలో తడబాటు లేకుండా, భయపడకుండా సభను కొనసాగించారు. విద్యార్థుల మాక్ అసెంబ్లీ, శాసనసభకు ఏ మాత్రం తీసిపోకుండా సాగింది. ప్రతిపక్షం చమత్కారంతో అడిగిన ప్రశ్నలు, అధికారపక్షం అంతే చమత్కార వ్యాఖ్యలతో చెప్పిన సమాధానాలు, ప్రతిపక్ష సభ్యులు సభాపతి



పోడియం దగ్గరకు వెళ్లి గొడవ చేయడం.. గొడవ చేసిన సభ్యులను మార్షల్స్ బయటకు తీసుకువెళ్లడం వంటి దృశ్యాలు నవ్వులు పూయించడంతో పాటు, సభాప్రాంగణమంతా నిజమైన శాసనసభలా కనిపించింది.

## విద్యార్థులతో గ్రూప్ ఫొటో

మాక్ అసెంబ్లీ ముగిశాక 'భారత రాజ్యాంగం పిల్లల కోసం' పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. విద్యార్థులందరితో కలిసి సీఎం, సభాపతి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు గ్రూప్ ఫొటోలు దిగారు. అనంతరం విద్యార్థులకు శాసనసభ, శాసనమండలి హాలుని చూపించిన విద్యా శాఖ మంత్రి లోకేష్ అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

## సభ ఎలా నిర్వహించాలో తెలిసింది

స్పీకర్ గా ఎన్నికై, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల ముందు ఆ రోల్ ప్రదర్శించడం, వారంతా వీక్షించడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. మాక్ అసెంబ్లీ ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాం. విద్యార్థులకు మాక్ అసెంబ్లీ పెట్టినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గారికి కృతజ్ఞతలు.



**– ఎస్ స్వాతి,** ఏపీ మోడల్ స్కూల్, శంఖవరం, కాకినాడ.

## ఆనందానికి అవధుల్లేవ్

మాక్ అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉంది. నేను, ప్రతిపక్ష నేత తీసుకెళ్లి స్పీకర్ ను ఆయన స్థానంలో కూర్చోబెట్టడం చాలా బాగుంది. ప్రతి సంవత్సరం మాక్ అసెంబ్లీ నిర్వహించాలి. ఈ కార్యక్రమంతో చాలా నేర్చుకున్నాను.



**– లీలా గౌతమ్,** జెడ్పీ హైస్కూల్, బీజేపురం, పార్వతీపురం మన్యం జిల్లా

## పెద్దయ్యాక సీఎం అవుతా

పెద్దయ్యాక రాజకీయాల్లోకి వద్దామనుకుంటున్నాను.. మాక్ అసెంబ్లీలో నేను ప్రొటెం స్పీకర్ గా పైన కూర్చుని కింద ఉన్న అందరినీ కంట్రోల్ చేయడం నచ్చింది. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, మా విద్యాశాఖ మంత్రి లోకేష్ గారికి కృతజ్ఞతలు.



**– రాజశేఖర్,** పూసపాడు ఎస్ కేవీఎస్ హైస్కూల్ బాపట్ల జిల్లా

## మాక్ అసెంబ్లీ - జీవితంలో మర్చిపోలేని అనుభూతి

మాక్ అసెంబ్లీలో పాల్గొనడం ద్వారా నా జీవితంలో మర్చిపోలేని అనుభూతిని సొంతం చేసుకున్నాను. అసెంబ్లీ, కౌన్సిల్ చూసే అదృష్టం దక్కడం సంతోషంగా ఉంది. మాక్ అసెంబ్లీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మాట్లాడాను.

**– గాయత్రి,** ఏపీఎస్ డబ్ల్యూ స్కూల్, వెల్దుర్తి, కర్నూలు జిల్లా



**– వాసిరెడ్డి విజయదుర్గ,** స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, పాఠశాల విద్యాశాఖ;
**అమలాపురపు దుర్గాప్రసాద్,** జర్నలిస్ట్

## ప్రతిపక్షం అంటే ప్రశ్నించడం మాత్రమే కాదు..

రాజకీయాలు, ఎలా ఉంటాయో మాక్ అసెంబ్లీ ద్వారా తెలిసింది. నాకు ప్రతిపక్ష నేత పాత్ర ఇచ్చారు. ప్రతిపక్షం అంటే ప్రశ్నించడం మాత్రమే కాదు.. సమాధానం కూడా క్లారిటీగా వినాలని తెలిసింది. సభను మాకు ఈ విధంగా చూపించడం చాలా సంతోషంగా ఉంది.



**– ఎల్ సౌమ్య సాయి,** జెడ్పీ హైస్కూల్, మక్కువ, పార్వతీపురం మన్యం జిల్లా

## డాక్టరై రాజకీయాల్లోకి వస్తా

మాక్ అసెంబ్లీకి ఎంపిక కావడం, పాల్గొనడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నాను. డాక్టర్ కావాలనేది నా కోరిక.. డాక్టర్ అయిన తర్వాత కూడా రాజకీయాల్లోకి రావొచ్చని మాక్ అసెంబ్లీలో పాల్గొనడం ద్వారా తెలుసుకున్నాను.

**– ఎ. చిన్మయిశ్రీ,** జెడ్పీ స్కూలు, తిరుచానూరు, తిరుపతి జిల్లా







## బొమ్మ గీశానోచ్!



**– కె. లతిక్ చరణ్,** ఏడో తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెర్లాం, విజయనగరం జిల్లా



**పి. లిఖిత,** 9వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా




**– వి. నఫ్రిన్,** తొమ్మిదో తరగతి, ఏపీ మోడల్ స్కూల్, కోటకందుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లా





**బి. తేజశ్రీ,** 6 వతరగతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, శేషాద్రిపురం, విజయవాడ

## చుక్కలు కలపండి



# రంగులు వేయండి





# చిటపట చినుకులు


చినుకులు చినుకులు చినుకులు
చిటపట కురిసే చినుకులు
మిలమిల మెరిసే మెరుపులు
పచ్చగ మారిన కొండాకోనలు

చిటపట చిటపట చినుకులు
కిలకిల పక్షుల అరుపులు
తడి తడి నేలల సొగసులు
బుడి బుడి పిల్లల అడుగులు

గలగల పారే ఏరులు
సరసర ఈదే చేపలు
పచ్చగ పండే పంటలు
మిలమిల మెరిసే మనసులు

– **R. అమృత,** 8వ తరగతి,
రాధ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురము

# నా ప్రాజెక్టు



– **బి.సారియా,** 5వ తరగతి, ఎంపీపీఎస్
దళవాయిపల్లి,
పుల్లంపేట, అన్నమయ్య..

(చిట్టి కథ)

## ఐకమత్యమే మహాబలం

అనగనగా నారాయణపురం అనే గ్రామం వుండేది. ఆ గ్రామంలో దివ్య, నవ్య, భవ్య అనే ముగ్గురు స్నేహితురాళ్ళు వుండేవారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ ముగ్గురు ప్రాణ స్నేహితులు. నారాయణపురంలో పాఠశాల లేకపోవడంతో, ప్రతిరోజూ పక్క గ్రామమైన బండ్లపల్లి పాఠశాలకు అడవి గుండా నడిచి వెళ్ళేవారు. బాగా ఆడుకునేవారు, నవ్వుకునేవారు ఎవరికైనా సహాయం అవసరమైతే ముందుండి ముగ్గురు కలిసి సహకరించేవారు.

ఒకసారి నవ్య తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడింది. ఆమెను దగ్గర పట్టణంలోని కొత్తచెరువు ఆసుపత్రికి తీసుకెళ్ళగా, డాక్టర్ ఆమెకు అపెండిసైటిస్ అని చెప్పాడు. 24 గంటలలోగా ఆపరేషన్ చేయకపోతే చాలా ప్రమాదం, ఆపరేషన్‌కి పదివేల రూపాయలు ఖర్చు అవుతుంది అన్నాడు డాక్టర్. నవ్య తల్లిదండ్రులు పేదవారు. ఈ విషయం తెలుసుకున్న దివ్య, భవ్య తమ కుటుంబాల దగ్గర నుంచి సహాయం అందించారు. ఆపరేషన్ విజయవంతమైంది. నవ్య మళ్లీ ఆరోగ్యంగా మారింది.

కొన్ని రోజుల తర్వాత, చిన్న అపార్థం వల్ల ముగ్గురి మధ్య గొడవ జరిగింది.చిన్న మాట పెద్దదై, వారు ఒకరితో ఒకరు మాట్లాడకుండా విడిపోయారు. ఎవరికి వారే యమునా తీరే లాగా ఎడమొహం పెడమొహం పెట్టుకొని పాఠశాలకు వెళ్ళేవారు.

ఒక రోజు, పాఠశాల నుండి ఊరికి వస్తూ వారు ప్రతిరోజు లాగే అదే అడవి దారి గుండా రాసాగారు. ముగ్గరూ కలిసి కాకుండా దూరం దూరంగా నడుస్తూ వస్తున్నారు ముందు దివ్య, కొంచెం వెనుక నవ్య, మరింత వెనుక భవ్య.

అప్పుడే ఒక్కసారిగా చెట్ల వెనుక నుంచి క్రూరమైన జంతువు హైనా బయటకు వచ్చింది! అది నేరుగా దివ్య వైపుకి దూకింది. దివ్య భయంతో "అయ్యో! కాపాడండి!" అంటూ కేకలు వేసింది ఆ శబ్దం విన్న నవ్య, భవ్య ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు. వారు పరుగెత్తుకుంటూ దగ్గరలో ఎండిపోయిన చెట్టు కర్రను లాగి భయపడకుండా హైనా వైపు బలంగా విసిరారు. వీళ్ళ అరుపులకు భయపడి హైనా పారిపోయింది. దివ్య ప్రాణం కాపాడబడింది. అది చూసి ముగ్గురూ ఒకరినొకరు కౌగిలించుకున్నారు ఆనందభాష్పాలతో సంతోషంగా "మీరు లేకపోతే నేను ప్రాణాలతో బయట పడేదాన్ని కాదు అందుకే అంటారు స్నేహ బలం చాలా గొప్పది "ఐకమత్యం చాలా విలువైనది!" అంది భవ్య "మనం వాదించుకున్నాం కానీ మన హృదయాలు మాత్రం విడిపోలేదు" అంది నవ్య.

"మనం కలిసి ఉంటే ఏ శక్తినైనా జయించగలం" అని అనుకున్నారు.

అప్పటి నుండి వాళ్లు ఎప్పుడూ గొడవపడలేదు. ఆ రోజు వాళ్లకు తెలిసింది "ఐకమత్యమే మహాబలం", "కలిసి ఉంటే ఎలాంటి ప్రమాదాన్నైనా ఎదుర్కోవచ్చు."

*(స్నేహం మన బలం. విభేదాలు మన బలహీనత. కలిసి ఉంటే విజయం మనకు దాసోహం అవుతుంది)*

రచన: **బి. నవత**, 8వ తరగతి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బండపల్లి, కొత్తచెరువు మండలం, శ్రీ సత్య సాయి జిల్లా.

# నిజమైన స్నేహం

ఒక ఊరిలో అరుణ అనే అమ్మాయి ఉండేది. ఆమె చాలా అంతర్ముఖి. తను ఎప్పుడూ ఎవరితో మాట్లాడేది కాదు. ఒంటరిగా ఉండేది. తనకు ఒక స్నేహితురాలు ఉండాలని కోరుకునేది. ఒక రోజు తరగతిలోకి చిన్ని అనే కొత్త విద్యార్థి వచ్చింది. చిన్ని అందరితో కలివిడిగా ఉండేది. అలానే అరుణతో కూడా వెంటనే కలిసిపోయింది. వారి మధ్య మొదలైన పరిచయం కొద్ది రోజుల్లోనే మంచి స్నేహంగా మారింది.

తన స్నేహితురాలు అరుణలోని అంతర్ముఖి లక్షణాలను చిన్ని గమనించింది. ఆమెలోని బిడియాన్ని గౌరవిస్తూనే తన స్నేహితురాలిని మార్చాలని చిన్ని అనుకుంది.

ఒక రోజు పాఠశాలలో ' మన నాయకత్వం ' అనే అంశం మీద జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు.

ఈ అంశం మీద అరుణ ఒక మంచి వ్యాసం రాసింది. అది చూసిన చిన్ని చాలా సంతోషపడి చాలా బాగా రాశావు పోటీలో నువ్వు ఎప్పుడు పాల్గొంటున్నావు అని అడిగింది. " అమ్మో నేను రాయగలను కానీ, అందరిలో మాట్లాడలేను, స్టేజి మీదకు వెళితే కాళ్ళు వణుకుతాయి, గొంతు మూగబోతుంది.. నేను పోటీల్లో పాల్గొనను " అని చెబుతుంది.

కానీ చిన్ని ఇలా అంటుంది.. "నువ్వు బాగా రాశావు.. నువ్వు చాలా బాగా మాట్లాడగలవు కూడా. ఆ విషయం నేను ఎప్పుడో గమనించాను. నువ్వు అంతర్ముఖివే. నీలోనూ ధైర్యం ఉంటుంది. మన ధైర్యం మనలోనే ఉంటుంది. దాన్ని బయటికి తీయాలి. నువ్వు ఆలోచించకుండా పోటీల్లో పేరు ఇవ్వు " అని ప్రోత్సహిస్తుంది. చిన్ని చెప్పడంతో అరుణ పోటీకి తన పేరు ఇస్తుంది.

పోటీ రోజు రానే వచ్చింది. ఆరోజు అరుణలో చాలా భయం వేసింది. నావల్ల కాదు చిన్ని అని చెప్పింది. చిన్ని మాత్రం.. " అరుణా.. నీ వెనుక నేను ఉంటాను. భయపడకు.. సరేనా " అని స్టేజి మీదకి పంపించింది. అరుణలో కొంచెం భయమేసింది. కానీ చిన్ని చెప్పిన మాటలు తన మనసులో పెట్టుకుంది. కళ్ళు మూసుకుని స్పీచ్ ప్రారంభించింది. అలవోకగా ఎంతో ధైర్యంతో స్పీచ్ ని పూర్తి చేసింది. అందరూ చప్పట్లు కొట్టారు. అరుణ వేగంగా స్టేజి దిగి చిన్నిని గట్టిగా హత్తుకుంది. ఈ పోటీలో అరుణకు రెండో బహుమతి వచ్చింది. అరుణ చిన్ని దగ్గరికి వచ్చి.. " చిన్నీ.. నువ్వు ఇచ్చిన ధైర్యం కారణంగానే ఈ బహుమతి. ఇది నీది " అని చిన్ని చేతిలో పెట్టింది. చిన్ని కళ్ళలో ఆనంద భాష్పాలు వచ్చాయి. " అరుణా.. ఇది నీ బహుమతి. నువ్వు ధైర్యంగా చెప్పావు.. ఇది నీదే " అని చెప్పి అరుణకి ఇస్తుంది. నిజమైన స్నేహం మన నుండి ఏదీ ఆశించదు.అరుణలోని అంతర్ముఖి లక్షణాలను చిన్ని పోగొట్టలేదు.. కానీ ఆమెలోని భయాన్ని పోగొట్టింది. ఆ తర్వాత వారి స్నేహం మరింత బలపడింది.

– **ఎం. రేవతి**, 9వ తరగతి, జిల్లా పరిషత్
బాలికోన్నత పాఠశాల, వినుకొండ , పల్నాడు జిల్లా



# న్యూస్ రౌండప్

## క్రీడలు

**అంధ మహిళల టీ20 ప్రపంచకప్ విజేత భారత్:** శ్రీలంక రాజధాని కొలంబో వేదికగా నవంబర్ లో జరిగిన అంధ మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీలో భారత అంధ మహిళల టీమ్ టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. అంధ మహిళల టీ20 విభాగంలో ఇదే తొలి ప్రపంచకప్ కావడం విశేషం. ఆరు దేశాలు పాల్గొన్న ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా భారత్ కప్ గెలిచింది.



ఈ టీ20 వరల్డ్ కప్ లో దీపిక కెప్టెన్‌గా, బ్యాటర్‌గా రాణించింది. ఈ చారిత్రాత్మక విజయంలో ఇద్దరు తెలుగమ్మాయిలు దీపికా యాదవ్, పంగి కరుణ కుమారి కీలక పాత్ర పోషించారు. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన నెలలోపే అంధ మహిళల ప్రపంచకప్ భారత్ గెలవడం సంతోషకరం.



**2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులు:** 2025, నవంబరు 26న జరిగిన కామన్వెల్త్ స్పోర్ట్స్ సర్వసభ్య సమావేశంలో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను అహ్మదాబాద్ కు అధికారికంగా ఇస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. కామన్వెల్త్ క్రీడల ఎగ్జిక్యూటివ్ బోర్డు అక్టోబరులో అహ్మదాబాద్ పేరును సిఫారసు చేసింది. ఇంతకుముందు 2010లో భారత్ ఢిల్లీలో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చింది.



**టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్ ఫెదరర్** టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ కు ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్ లో చోటు దక్కింది. ఫెదరర్ పురుషుల సింగిల్స్ లో 20 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలిచిన తొలి ఆటగాడిగా నిలిచాడు. 2022లో ఫెదరర్ రిటైరయ్యాడు.

ప్రపంచకప్ బాక్సింగ్ కప్ ఫైనల్స్ లో మన దేశ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ (తెలంగాణ) అదరగొట్టింది. ఫామ్ నిరూపించుకుంటూ స్వర్ణంతో మెరిసింది. నవంబర్ 20న మహిళల 51 కేజీల ఫైనల్లో నిఖత్ 5–0తో గవో యీ గ్జువాన్ (చైనీస్ తైపీ)ని చిత్తు చేసింది. **స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్**



మహిళల కబడ్డీ ప్రపంచకప్ భారత్ కైవసం చేసుకుంది. 2025, నవంబరు 24న ఢాకాలో జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 35–28తో చైనీస్ తైపీని ఓడించింది. రీతూ నేగి సారథ్యంలోని భారత్.. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా టైటిల్ నిలబెట్టుకుంది. 11 దేశాలు పోటీపడిన ఈ టోర్నీలో గ్రూప్ దశలో థాయ్ లాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండాపై ఘన విజయాలు అందుకున్న భారత్.. సెమీస్ లో 33–21తో ఇరాన్ ను ఓడించింది.





**ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**

భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. 2025, నవంబరు 24న సిడ్నీలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 21–15, 21–11తో యుషి తనక (జపాన్) పై విజయం సాధించాడు. లక్ష్యసేన్ ఈ ఏడాది (2025) తొలి అంతర్జాతీయ టైటిల్ గెలుచుకున్నాడు.

## నియామకాలు



రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తెలుగు వ్యక్తి: 1989 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి ఓరుగంటి శ్రీనివాస్ ను రాజస్థాన్ ప్రభుత్వం తమ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సియస్) గా నియమించింది. 2026 సెప్టెంబర్ వరకు శ్రీనివాస్ రాజస్థాన్ సియస్ గా కొనసాగుతారు. ఈయన అరకులోయలో 1966 లో జన్మించారు.



**నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ–నల్సా:** సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ–నల్సా) 2025, నవంబరు 24 నుండి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఇప్పటివరకు ఈ పదవిలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ గవాయ్ పదవీ విరమణ చేసిన తర్వాత 24న జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

### ఏపీ సీఎస్ విజయానంద్ పదవీ కాలం పొడిగించిన ప్రభుత్వం:

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) విజయానంద్ నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా తన పదవీకాలాన్ని ప్రభుత్వం 3 నెలలు పొడిగించింది. ఈ మేరకు కేంద్రం కూడా ఆమోదం తెలపటంతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఆదేశాలతో 2026 ఫిబ్రవరి 28 వరకు ఆయన ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా కొనసాగనున్నారు.



2026 మార్చి 1వ తేదీ నుండి తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1991 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ప్రస్తుత రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సియంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ను నియమిస్తూ ఇదే ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

## జాతీయ, అంతర్జాతీయ విశేషాలు

### ప్రపంచంలోనే అతి పెద్ద మ్యూజియం ఈజిప్టులో ప్రారంభం

ప్రపంచంలోనే అతి పెద్ద మ్యూజియం ఈజిప్టులో నవంబరు 1న ప్రారంభమైంది. కైరోలోని గాజా పిరమిడ్ల దగ్గర నిర్మించిన ఈ మ్యూజియం పూర్తవ్వడానికే దాదాపు రెండు దశాబ్దాలు పట్టింది. ఇందులో దాదాపు 50 వేల వరకు కళా ఖండాలు ఉన్నాయి. ఇవన్నీ ఈజిప్టు పురాతన నాగరికతను ప్రతిబింబించేవే. దీని నిర్మాణ వ్యయమే.. దాదాపు 8,320 కోట్లు. ఈ మ్యూజియం వైశాల్యం 24 వేల చదరపు మీటర్లు. ఇందులో 12 ప్రధాన గ్యాలరీలు ఉంటాయి. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్ సిసీ దీన్ని ప్రారంభించారు.



### అంగారక గ్రహం గురించి శోధించేందుకు 'ఎస్కపేడ్' ప్రయోగం

అంగారక గ్రహం గురించి లోతుగా శోధించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఎస్కపేడ్' ప్రయోగం విజయవంతమైంది. అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆర్జిన్'కు చెందిన భారీ న్యూగ్లెన్ రాకెట్.. ఈ వ్యోమనౌకను నింగిలో ప్రవేశపెట్టింది. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ అంతరిక్ష కేంద్రం ఈ ప్రయోగానికి వేదికైంది. 'ఎస్కపేడ్' మిషన్లో బ్లూ, గోల్డ్ అనే రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. ఇవి అంగారకుడి వాతావరణాన్ని పరిశీలించనున్నాయి. అరుణగ్రహం తన వాతావరణాన్ని కోల్పోయిన తీరును ఇవి శోధించనున్నాయి. అంగారకుడి నివాసయోగ్యతకు సంబంధించి అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. ఆ గ్రహ అయస్కాంత క్షేత్రం, ప్లాస్మా వాతావరణాన్ని శోధించనున్నాయి. స్పేస్‌ఎక్స్ తోపాటు తాజాగా 'బ్లూ ఆర్జిన్' కూడా పునర్వినియోగ రాకెట్ పరిజ్ఞానం సాధించినట్లయింది.

### విద్యార్థుల కోసం 'జెన్–జడ్' పోస్టాఫీస్ లు

మన దేశ యువత కోసం ఆధునిక సేవలను అందించే దిశగా పోస్టల్ విభాగం జెన్–జడ్ థీమ్ తో పోస్టాఫీసులను తీసుకొచ్చింది. మొదటి జెన్–జడ్ పోస్టాఫీసును 2025, నవంబరు 19న ఐఐటీ ఢిల్లీలో, నవంబరు 20న ఢిల్లీ యూనివర్సిటీలో మరొక పోస్టాఫీసును ప్రారంభించారు. పోస్టల్ విభాగం కేవలం లేఖలను పంపించడానికే కాకుండా నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా వివిధ సేవలు అందించే కేంద్రంగా మార్చు చెందిందని యువతకు చూపించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసింది.

ఈ జెన్–జడ్ పోస్టాఫీసు కేవలం పార్శిల్స్, లేఖలు పంపించడమే కాకుండా సోషల్ లెర్నింగ్ స్పేస్ రూపొందించారు. విద్యార్థులు ఇక్కడ ఉచితంగా వైఫైను వినియోగించుకోవచ్చు. అలాగే పుస్తకాలు చదువుకునే లైబ్రరీగా ఉంటుంది. సౌకర్యవంతంగా కూర్చొని ఆర్ట్ ప్రదర్శనలను వీక్షించవచ్చు. ఈ జెన్–జడ్ పోస్టాఫీసులో ఆర్ట్ కార్నర్ కూడా ఉంటుంది. అందులో విద్యార్థులు రూపొందించిన చిత్రాలు, స్కెచ్లు, ఫొటోగ్రాఫ్ లను ప్రదర్శిస్తారు.

2026 జనవరి నాటికి మొత్తం 46 విద్యా సంస్థల్లో ఉన్న పోస్టాఫీసులను జెన్–జడ్ పోస్టాఫీసులుగా తీర్చిదిద్దడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### ఆపదలో ఉన్న మహిళలకు హెల్ప్ లైన్

మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) 24 గంటలూ అందుబాటులో ఉండే కొత్త హెల్ప్‌లైన్ నంబర్–14490ను ప్రారంభించింది. హింస, వేధింపులు లేదా ఏ రూపంలోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇది ఉపయోగపడుతుందని వివరించింది. దేశవ్యాప్తంగా మహిళలు ఈ నంబర్ ను సంప్రదించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకోవచ్చు. వీరికి హెల్ప్ లైన్ సిబ్బంది సహాయం చేస్తారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించటానికి సాయపడతారు.

### జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సు 2025:

జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సు 2025, నవంబరు లో జొహాన్నెస్బర్గ్ లో జరిగింది. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని 'సమ్మిళిత, సుస్థిర ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై ప్రసంగించారు. పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తూ, సాంస్కృతికంగా సమున్నతంగా ఉంటూ, సామాజిక జీవనాన్ని మెరుగుపరిచేలా 'ప్రపంచవ్యాప్త సంప్రదాయ విజ్ఞాన నిధి'ని జీ20లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మోదీ నొక్కి చెప్పారు. పునర్వినియోగం, శుద్ధ ఇంధనం, సుస్థిరతలకు భారత్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. 'జీ20 ఓపెన్ శాటిలైట్ డేటా పార్టనర్షిప్' ఏర్పాటుచేసి, అంతరిక్ష సంస్థల మధ్య సహకారాన్ని అందించుకోవాలని ప్రతిపాదించారు. తద్వారా దక్షిణార్ధగోళ దేశాలకు ఉపగ్రహ సేవలు మరింతగా అందుబాటులోకి వస్తాయన్నారు.

### భారత్ నైపుణ్యాల నివేదిక–2026:

ఏఐసీటీఈ, సీఐఐ సహకారంతో వీబాక్స్ సంస్థ సర్వే నిర్వహించి భారత్ నైపుణ్యాల నివేదిక–2026ను తాజాగా విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు లక్షల మందికి గ్లోబల్ ఎంప్లాయిబిలిటీ టెస్ట్(గెట్) పేరిట ఆన్లైన్ పరీక్షలు నిర్వహించి నివేదికను రూపొందించింది. దీని ప్రకారం భారత యువతలో ఉద్యోగ నైపుణ్యాలు ఏటేటా పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా సగటున 56.35శాతం మంది ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను సాధించారు. అంటే వారు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు చేసేందుకు అర్హత కలిగి ఉన్నారు. గత ఏడాది అది 54.81 శాతం కావడం గమనార్హం. మొత్తంగా అమ్మాయిల్లో 54 శాతం మందికి ఉద్యోగ నైపుణ్యాలుండగా... అబ్బాయిల్లో అది 51.50 శాతమే. మరోవైపు అత్యధికంగా ఉద్యోగ నైపుణ్యాలున్నది ఎంబీఏ చదివిన వారిలోనే కావడం విశేషం. బీటెక్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలుస్తున్నారు.

### 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం:

ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 15–59 ఏళ్ల మధ్య నిరక్షరాస్యులు 81 లక్షల మంది ఉన్నారు. 2024–25లో నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమంలో 3.53 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. మిగిలిన వారిని విడతల వారీగా అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఉల్లాస్' కార్యక్రమం కింద అక్షర ఆంధ్ర అమలు చేయనున్నారు.

– **డా. ఎస్.వి.లక్ష్మణరావు**, కన్సల్టెంట్, కమ్యూనిటీ మొబిలైజేషన్ విభాగం

# రచనలకు ఆహ్వానం

## ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, రచయితలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి...

పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యా, విషయక, విజ్ఞాన అంశాలతో వస్తున్న మాసపత్రిక **మన బడి** కోసం.. మీ నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రచనలు ఏవైనా, ఎవరైనా పంపవచ్చు. కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు, జోకులు, బొమ్మలు, కార్టూన్లు, అనువాద రచనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ప్రాజెక్టులు... ఇలా ఏ అంశాన్నయినా రాసి పంపండి. బాగున్నవాటిని ప్రచురిస్తాం. సొంత రచనలై ఉండాలి, ఎక్కడ ప్రచురితం కాకూడదు. మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జోడించండి. ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. ఎంపిక కాని రచనలు తిరిగి పంపబడవు. ప్రచురితమైన వాటిలో ఉత్తమ రచనలకు చక్కని బహుమతి ఇవ్వబడును. ఈ రచనా యజ్ఞంలో పిల్లలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,రచయితలు భాగస్వాములవ్వాలని కోరుతున్నాం. ఇందులో రచయితల వెలిబుచ్చిన అభిప్రాయాలు పూర్తిగా వారి సొంతం. రచయితల అభిప్రాయాలతో సంపాదకులు, ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏకీభవించాల్సిన పనిలేదు.



మీ రచనలు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్/ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం,
కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్, పటమట, విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520010,
ఈమెయిల్ : manabadimagazine@apschooledu.in
వాట్సాప్ నెంబర్: 8712652298

ఉత్తరాలు-జీవన పాఠాలు

# డిజిటల్ పాదముద్రలు రక్షించాలి




నేను ఎందుకు భయపడుతున్నాను: 30 సంవత్సరాల క్రితం 'కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్' తో పా World Wide Web కూడా పుట్టింది. ఆ ఆవిర్భావం ఈరోజటి ప్రపంచపు రూపురేఖలను సమూలంగా మార్చివేసింది. అలాగే బాల్యానికి, యుక్తవయస్కతకు కొత్త రూపాన్నిచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ముగ్గురిలో ఒక పిల్లవాడు రోజూ ఇంటర్నెట్ వాడుతున్నాడు. ఇక ఈ తరం పెరుగుతున్నకొద్దీ, ఆ నిష్పత్తి కూడా ఇంకా ఇంకా పెరుగుతూనే ఉంటుంది.

సామాజిక మాధ్యమాలను పిల్లలు వాడడంలోని లాభనష్టాలపై చర్చలు మనకు విదితమే. అయితే, పిల్లలు ప్రమాదకరమైన విషయాల జోలికి వెళ్ళకుండా చూడడం, అవతలివారు వారిని బెదిరించకుండా చూడడం లాంటి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. పిల్లలు, తల్లిదండ్రులు తమ స్వవిషయాలను ఈ మాధ్యమాల్లో ఎక్కువగా వెల్లడి చేయడం పట్ల ప్రమాదాలను గుర్తిస్తున్నారు. కానీ నిజానికి, సామాజిక మాధ్యమాల్లో పిల్లలు తమ ప్రొఫైల్స్ లో చూపించే విషయాలు కేవలం ఒక మచ్చుతునక మాత్రమే. పిల్లల గురించి అంతులేని సమాచారం సేకరించబడుతున్నది. ఆ విషయ సేకరణ ఎందుకు జరుగుతున్నది అనే విషయంపై పూర్తి వివరాలు తెలియక పోయినా, అది చాలా ముఖ్యమైన సమాచారంగా గుర్తించాలి. పిల్లలు వారి ఆన్లైన్ జీవితాల్లో భాగంగా రోజూ సామాజిక మాధ్యమాలను, సెర్చ్ ఇంజన్లను, ఈ–కామర్స్, ప్రభుత్వ వెబ్సైట్లు వినియోగిస్తున్నారు. ఆటలు ఆడుతున్నారు. ఆప్స్ డౌన్లోడ్ చేసుకుంటున్నారు. వారు జియో లొకేషన్ సర్వీసెస్ కూడా వాడుతున్నారు. ఇదంతా చేసినప్పుడు ... వారి సమాచారం కొన్ని వేల శకలాలుగా, డిజిటల్ పాదముద్రలుగా వారి చుట్టూ ప్రోగుపడుతున్నది. పిల్లల సమాచారం కొంత ... వారు పుట్టకముందే సేకరించబడి, దానిని ఎవరు, ఎలా వాడాలో అనే విషయంలో వారు అనుమతి ఇవ్వకముందే ప్రోగుచేయబడి ఉంటున్నది.

"బిగ్ డేటా" యుగంగా పిలువబడుతున్న ఈ సమాచార సేకరణ విధానం ... పిల్లలకు సమర్థవంతమైన, వ్యక్తిగతమైన, వేగవంతమైన సేవాసౌకర్యాలను ... వారి బాగోగుల కోసం అందించగల అవకాశం ఉన్నది. కానీ, అదే సమయంలో అది ... వారి భద్రత, గుప్తత, స్వతంత్రతలతో పాటుగా వారి భావిజీవితంలో వారు తీసుకోవాల్సిన నిర్ణయాలను దెబ్బతీయగల ప్రతికూల స్వభావం అధికంగా కలిగి ఉంది. మూడవ వ్యక్తులతో లేదా సంస్థలతో మనం పిల్లల చిన్నతనంలో పంచుకుంటున్న సమాచారం ... తమ లాభాల కోసం వారు ఇతరులకు అమ్ముకోవడమో లేదా యువతి యువకులను ... ముఖ్యంగా బడుగు బలహీనవర్గాల పిల్లలను ... దోపిడికి గురిచేసే అవకాశం ఉన్నది. ఈలోగా ... మన గుర్తింపు సమాచారం దొంగిలించే వారు, హ్యాకర్లు ... ఈ–కామర్స్ ప్లాట్ ఫామ్స్ లో పెద్దలను, పిల్లలను ఏ రకంగా మోసపుచ్చవచ్చో లేదా కొల్లగొట్టవచ్చో అనే విషయం తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ... ఇంటర్నెట్ వాడే వారు ఏ వయసు వారైనా సరే ... వారి ప్రతి కదలికను ... సెర్చ్ ఇంజన్లు వెంటాడుతున్నవి. అలాగే కొన్ని ప్రభుత్వాలు కూడా ఆన్లైన్లో ఎక్కడ, ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి మరింత సూక్ష్మంగా నిఘా చేసే అవకాశాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకొంటున్నవి. అంతేగాక, చిన్నారుల సమాచారం ముందస్తుగా తెలుసుకోవడం ద్వారా వారికి భవిష్యత్తులో కల్పించవలసిన విద్య, వైద్యం, రవాణా సౌకర్యాల అవకాశాలను ప్రభావితం చేయగల సామర్థ్యం పెరుగుతున్నది. పెద్దవారి సమాచార సేకరణ, దాని వాడకం ... వారి అనుమతులు, గోప్యతల మధ్య సంబంధం క్లిష్టమైనదే కానీ పిల్లల విషయంలో అది రెట్టింపు అవుతుందని మనం గుర్తెరగాలి. ఎందుకంటే ... పిల్లల హక్కులను, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్నెట్ రూపొందించబడలేదు. కొద్దిమంది మాత్రమే సమాచారాన్ని పంచుకోవడంలోనూ, దానిని గోప్యంగా ఉంచడంలోనూ గల క్లిష్టతను అర్థం చేసుకొని ... దానికి అనుగుణంగా స్పందించగలిగిన సామర్థ్యాన్ని కలిగివున్నారు.

చాలా తరచుగా, పిల్లలకు ... వారి స్వంత సమాచారం పైన వారికి ఎలాంటి హక్కులు ఉన్నాయి, దాని వాడకం వల్ల వచ్చే పరిణామాలు ఏమిటి, అది వారిని ఎలాంటి ప్రమాదాల్లోకి నెడుతుంది అనే విషయాలు తెలియవు. సామాజిక మాధ్యమాల్లో గోప్యతకు సంబంధించిన నియమనిబంధనలు పిల్లలను వదిలివేసినా ... బాగా చదువుకున్న పెద్దలకే అవగాహన చేసుకోగల పరిస్థితి లేదు. ది న్యూయార్క్ టైమ్స్ చేసిన ఒక విశ్లేషణలో తేలిందేమంటే ... సామాజిక మాధ్యమాల్లో గోప్యత పాలసీలు చదవడానికి ... ఒక సగటు కాలేజీ విద్యార్థికి గల గ్రహణసామర్థ్యం కన్నా ఎక్కువ స్థాయి ఉండాలి. దాని అర్థం ... ఎంతోమంది వాడకందారులు ... ముఖ్యంగా పిల్లలు, యువతీయువకులు ... వాటిని అర్థం చేసుకోకుండానే వారి అనుమతి ఇస్తున్నారు.

**నేను ఎందుకు ఆశావహంగా ఉన్నాను:**

ఈరోజు మన ముందున్న పెద్ద సవాలు ఏమిటంటే ... సమాచార భద్రత విషయాలలో ప్రజలందరికీ ముఖ్యంగా పిల్లలకు వారి హక్కులను వినియోగించుకోవడంలో వారు సాధికారత సాధించగల పద్ధతులను రూపొందించి ... బిగ్ డేటా, కృత్రిమ మేధస్సుల లాభాలను సంపూర్ణంగా పొందేవిధంగా తగిన హామీ ఇవ్వాలి. ఈ చర్యలు ఆరంభమైనట్లు మనము గమనిస్తూనే ఉన్నాము. ప్రభుత్వాలు నియమనిబంధనల చట్టాలను మెరుగుపరుస్తున్నవి; ప్రైవేటు సంస్థలు వారివారి పాత్ర ఏమిటో గ్రహిస్తున్నవి; ఇంటర్నెట్ ప్రపంచాన్ని ... సురక్షితంగా వాడడానికి పిల్లలను ఏవిధంగా సమాయత్తం చేయవచ్చో వారు ఆలోచిస్తున్నారు. అయితే, ఇది ఆరంభం మాత్రమే.

పిల్లలకు గల ప్రత్యేక గోప్యత హక్కు గురించి 'కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్' స్పష్టంగా చెప్పింది. దానిని ఆన్లైన్ కి కూడా తప్పనిసరిగా వర్తింపజేయాలి. అన్ని హక్కులలోనూ పిల్లల శ్రేయస్సు, అప్పుడే వికసిస్తున్న వారి ఆలోచనాక్రమం మొదలైన విషయాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ... పిల్లల సమాచార గోప్యత ... దాని పరిధిలోనూ, దానిని అమలు పరచడంలోనూ ... పెద్దవారి సమాచార గోప్యత కన్నా భిన్నంగా ఉంటుంది. ఈ విషయంలో పిల్లలకు మరింత దుర్భేద్యమైన రక్షణ అవసరము అనే బలమైన వాదన ఉన్నది.

పిల్లలు సామాజిక మాధ్యమాలను వాడుతున్నప్పుడు... ఇంటర్నెట్లో సేవలు అందించేవారు లేదా వ్యాపారసంస్థలు ఆయా పిల్లల సమాచారాన్ని బయటివారికి తెలపాలా వద్దా అనే విషయం నిర్ణయించుకోవడానికి ... ఆప్షన్స్ ఉండాలి. అలాగే ఆ సంస్థల నియమనిబంధనలు పిల్లలు అర్థం చేసుకోగలిగినంత స్పష్టంగా ఉండాలి. కొంతమంది పిల్లలే వాదించినట్టు సామాజికమాధ్యమాల్లో వారి వ్యక్తిగత వివరాలు లేకుండా కూడా చేయవచ్చును అనేది ఒక ఉదాహరణ. ఆన్లైన్లో పిల్లల ప్రతి కదలికను, వారి సమాచారాన్ని సేకరించే పరిస్థితులు ఉన్నాయి కాబట్టి స్పష్టమైన, పారదర్శకమైన, సులభసాధ్యమైన గోప్యతా విధానాలను పిల్లలకు

అందుబాటులోకి తీసుకురావడం చాలా కీలకమైనది. ఆ చర్యల ద్వారా పిల్లలు వారు ఏం చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో గుర్తెరిగి వారి అనుమతి ఇస్తారు. అలాగే వారి హక్కులు ఏమిటో తెలుసుకుని ... వారి సమాచారం ఏ విధంగా సేకరించబడుతుందో, ఏ విధంగా వినియోగించబడుతుందో అర్థం చేసుకుంటారు. వారి డిజిటల్ హక్కులు సాధించుకునేందుకు వీలుగా వారికి అవగాహన ఉండేవిధంగా వారిని సమాయత్తం చేయడం చాలా అవసరం.

ప్రైవేట్ సామాజిక సేవలు అందించే ప్రైవేటు రంగ ఇంటర్నెట్ సర్వీసులు అందించేవారు, సామాజిక మాధ్యమాల సేవలు అందించే వారు ... పిల్లల రక్షణను బలోపేతం చేయడానికి కీలకమైన పాత్ర వహిస్తారు. పిల్లలు ఎప్పుడు ఎక్కడ ఉన్నారో తెలిపే కదలికల సమాచారం, వారి బ్రౌజింగ్ అలవాట్లు ... మరీ ముఖ్యంగా వారి వ్యక్తిగత సమాచార రక్షణ పట్ల వారు పారదర్శకమైన, నైతికమైన ప్రమాణాలను పాటిస్తూ నిరంతర అజమాయిషీ చేస్తూ ఉండాలి.

నూతనంగా రూపొందించిన European General Data Protection Regulation (GDPR) లాంటి నిబంధనావళి ఈ విషయంలో ఓ ముందడుగు. దాని ప్రకారం, పిల్లలతో సహా ఇంటర్నెట్ వినియోగదారులు ఎవరైనా సరే ... వారికి పారదర్శకమైన, స్పష్టమైన, గోప్యత నోటీసు పొందడానికి హక్కు ఉంటుంది. వారి సమాచారం ఎలా వాడబడుతుందో వారికి తెలపాలి. వారి సమాచారాన్ని ఏవిధంగా పొందుపరచారో తెలుసుకునేందుకుగాను, దాని నిజప్రతిని వారు పొందడానికిగాను వారికి వీలు ఉండాలి. అవసరమయితే, వారి సమాచారాన్ని సరిచేసుకునే వీలు వారికి కల్పించాలి.

గ్లోబల్ పల్స్ అనేది ఐక్యరాజ్యసమితి కార్యక్రమం. నూతన డిజిటల్ మూలాధారాలు (sources), తక్షణ–విశ్లేషణ సాంకేతికత (real–time analytics technologies) మొదలైన పరిజ్ఞానం... మానవ క్షేమాన్ని, కొత్తగా తలెత్తే అవకాశం గల హానికరమైన విషయాలలో మార్పును అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తుంది. తద్వారా ఆయా అంశాలలో అభివృద్ధి సాధించడానికి వీలవుతుంది. గోప్యత, సమాచార రక్షణ విషయంలో సహేతుకమైన పట్టింపులకు జవాబుగా గ్లోబల్ పల్స్ ... సంబంధిత నిపుణులతో సంప్రదించి ... అసంబద్ధమైన, న్యాయవ్యతిరేకమైన పద్ధతులలో వ్యక్తుల సమాచారాన్ని మార్చి, వారిని వేరే వ్యక్తులుగా గుర్తించే పరిస్థితులను నిరోధిస్తూ ... గోప్యతను సహేతుకంగా గౌరవించడం, వ్యక్తిగత గోప్యత రక్షణ, వ్యక్తిగత సమాచారాన్ని వాడుకోవడానికి తగిన అనుమతుల నియమావళిని రూపొందించింది.

– **హెన్రియేట్ హెచ్. ఫోర్**
యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
అనువాదం: **చింతకుంట్ల సంపత్ రెడ్డి**

## జనరల్ నాలెడ్జ్

### భారతదేశం – జాతీయ చిహ్నాలు
### ఆంధ్రప్రదేశ్ – రాష్ట్ర చిహ్నాలు

మన దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం ప్రతిబింబించేలా స్వాతంత్ర్యం వచ్చాక, గణతంత్రంగా ఏర్పడినాక రూపొందించినవి 17 జాతీయ చిహ్నాలు ఉన్నాయి. భారత దేశ జాతీయ చిహ్నాన్ని (అశోక సింహ శిఖరం) మన భారత దేశం గణతంత్ర దేశంగా మారిన రోజు 1950 జనవరి 26న భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇది భారత గణతంత్ర రాజ్యానికి ప్రాతినిధ్య ముద్ర. దీనిని ఉత్తరప్రదేశ్ లోని సారనాథ్ అశోక్ స్తంభంలో చిహ్నాలు ఆధారంగా రూపొందించారు. భారత జాతీయ చిహ్నం నినాదం "సత్య మేవ జయతే"

**జాతీయ చిహ్నాలు**

1. మన దేశ జాతీయ చిహ్నం?
జ: **సారనాథ్ లోని అశోక స్థూపం. ఈ స్థూపంలోని నాలుగు సింహ తలాటాలు ఉన్నప్పటికీ మనకు మూడు సింహాలు మాత్రమే కనిపిస్తాయి.**
2. మన దేశ జాతీయ పుష్పం?
జ: **కమలం**
3. మన దేశ జాతీయ పతాకం
జ: **త్రివర్ణ పతాకం. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో మధ్యలో అశోక చక్రం ఉంటుంది.**
4. మన దేశ జాతీయ గీతం ?
జ : **'జనగణమన', దీనిని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గారు రచించారు.**
5. మన దేశ జాతీయ గేయం ఏది ?
జ : **'వందేమాతరం' దీనిని బంకించంద్ర చటర్జీ గారు రాశారు**
6. మన దేశ జాతీయ పక్షి ఏది ?
జ : **నెమలి.**
7. మన దేశ జాతీయ జంతువు ఏది ?
జ : **రాయల్ బెంగాల్ టైగర్.**
8. మన దేశ జాతీయ వృక్షం ఏది ?
జ : **మర్రిచెట్టు.**
9. మన దేశ జాతీయ ఫలం ఏది ?
జ : **మామిడి పండు.**
10. మన దేశ జాతీయ నది ఏది ?
జ : **గంగా నది. ఈ నది మన దేశంలోనే పొడవైన నది. దీని పొడువు – 2,525 కిలోమీటర్లు.**
11. మన దేశ జాతీయ జలచరం ఏది ?
జ : **గంగా నది డాల్ఫిన్**
12. మన దేశ జాతీయ క్యాలెండర్ ఏది ?
జ : **శక క్యాలెండర్. దీనిని 1957 లో భారత దేశం స్వీకరించింది.**
13. మన దేశ జాతీయ కరెన్సీ ?
జ : **రూపాయి**

**మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చిహ్నాలు**

1. మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పక్షి ఏది ?
జ : **రామచిలుక**
2. మన రాష్ట్ర గేయం ఏది ?
జ : **మా తెలుగు తల్లికి మల్లెపూదండ. దీనిని శంకరంబాడి సుందరాచారి రాశారు.**
3. మన రాష్ట్ర చిహ్నం ఏది ?
జ: **పూర్ణకుంభం**
4. మన రాష్ట్ర వృక్షం ఏది ?
జ : **వేప చెట్టు.**
5. మన రాష్ట్ర జంతువు ఏది ?
జ : **కృష్ణ జింక.**
6. మన రాష్ట్ర భాష ఏది ?
జ : **తెలుగు భాష**
7. మన రాష్ట్ర ఫలం ఏది ?
జ : **మామిడి పండు.**
8. మన రాష్ట్ర క్రీడ ఏది ?
జ : **కబడ్డీ**
9. మన రాష్ట్ర పుష్పం ఏది ?
జ : **మల్లె పువ్వు**
10. మన రాష్ట్ర నాట్యం ఏది ?
జ : **కూచిపూడి**

– సమాచార సేకరణ:
**పాలదార వెంకటరమణ**, టీజీటీ (సోషల్),
APTWR Boys School, సీతంపేట,
పార్వతీపురం మన్యం జిల్లా.
95423 93923


# విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జన పెంపొందించాలి

**సమగ్ర శిక్ష ఏపీఎస్పీడీ డా. ఎం. ఆర్. ప్రసన్నకుమార్ గారు.**

విజయవాడ మ్యారీస్ స్టెల్లా కాలేజీలో జరుగుతున్న మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ కౌన్సిలర్ల శిక్షణా కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఏపీఎస్పీడీ డా. ఎం.ఆర్.ప్రసన్న కుమార్ గారు, కేజీబీవీ సెక్రటరీ శ్రీ డి.దేవానందరెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రతి మండలంలో మెంటల్ హెల్త్ & కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్లను నియమించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. అనంతరం కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి గారు మాట్లాడుతూ... కౌన్సిలర్ల కీలక పాత్రను వివరిస్తూ.. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంచాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో (KGBVs) సురక్షితమైన, ఆప్యాయతతో కూడిన, ప్రేరణనిచ్చే వాతావరణాన్ని సృష్టించాలన్నారు.














# మంగళగిరిలో మోడల్ లైబ్రరీని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

మంగళగిరి పట్టణం శివాలయం వద్ద రూ.1.72 కోట్లతో ఆధునీకరించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. 1986లో ముఖ్యమంత్రి హోదాలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి సారథ్యంలో మంత్రి నారా లోకేష్ చొరవతో లైబ్రరీని ఆధునీకరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

లైబ్రరీ ఆధునీకరణకు సీఎస్ఆర్ ఫండ్స్ కింద గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(APTS) రూ.42 లక్షలు, నోవో(NOVO) ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు అందించారు. లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్ లో పిల్లల కోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో వుండేవిధంగా రూమ్, బుక్ రీడింగ్ రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ ఏరియా, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాలతో పాటు మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, నైపుణ్యంతో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే వారికోసం రీడింగ్ ఏరియా, డిజిటల్ లైబ్రరీ డిజిటల్ రీసోర్స్ సెంటర్ ను ఏర్పాటుచేశారు.















# ల్యాడర్ గేమ్



Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur